
బత్తుల ప్రసాద్



# సిన్నిగాడి సికారి!

పడమటిపక్క పొద్దు నల్లమలకొండల్లోకి సిన్నగ జారిపాయ. జంగిలిగొడ్లు కాయను మిట్టకు పోయిన ఆవుల రామన్న, మేకల్ను తోలకపోయిన చెవిటి కమాల్ అప్పుడే ఊళ్లోకి బరుగొడ్లను, మేకల్ను తోలకచ్చిరి. సవరాలు, గడ్డాలు చెయ్యడానికి పక్క పల్లెలకు పోయిన మంగళోల్ల రామన్న సంకకు పెట్టె, భుజాన మూట ఎత్తుకుని వచ్చిండు. ఏట్లో గుడ్డలుతకడానికి బొయిన సాకలోల్లు ఉతికిన గుడ్డల మూటల్ను ఈపునెత్తుకొని వర్సగా గూడ్సుబండి వచ్చినట్లు వచ్చాండిరి. చేలల్లోకి పన్లకు పొయిన ఆడోళ్లు నెత్తిన గడ్డిగంప లెత్తుకుని కొందరు, కూరాక్కు తమేటాలో, పచ్చిమిరపగాయులో, గోవాకో ఒళ్లో పెట్టుకుని కొందరు వచ్చాండిరి.

ఆకాసంలో కొంగలు బార్లు తీరి పోతాండ. మా ఇంటికాడ చింతచెట్టు చేరుకున్న కాకులు కావ్‌కావ్ అంటా పలకరిచ్చుకుంటాండ. జంగిలిగొడ్లు, మేకలు రేవుకుంటూ పాయిన దుమ్ము మేకపెంటికలు, పేడ ... ఇయన్నీ గలిపి ఈదంతా సందకాడ ఎప్పుడూ వచ్చే వాసనే వచ్చాంద. నేను గూడా పగులంతా బేకారు తిరుగుడు తిరిగి ఇంటికొచ్చి.. మా యమ్మ నన్నుజూచి ఆచ్చర్యపోయినట్లు మొకం పెట్టి, "ఏం నాయనా, అపుడే వచ్చివి! ఇంత బెరీన ఇంటికొచ్చే ... ఆడ గజిటాపీసర్ పని ఎవురుజేచ్చురు? పనిలా, పాటలా. రోజురోజుకు పోరంబోకు నా బట్టయిపోతాండడు. ఇంటికాడ ఒక కట్టెపుల్లో కంపపుల్లో కొడ్దాం, ఒక కడవ నీళ్లు తెద్దాం అనే దాసే లేకపాయ! అలేకాం మాదిరి యాలకు రాడం, తిండం, తిరగడం! ఇంటిపట్టున కూచ్చొని



సదువుకోరా నా బట్టకొడకా అని ఎంత జెప్పిన ఆ మాటే సెవిలో దూరకుండ పాయ! ఎంత తిట్టినా సిగ్గు లాకపాయ! కొడ్తమంటే సిన్నపిల్లోడా ... బరుగొడ్డు మాదిరుండాడు. పోనీ, ఎట్టబొయ్యే నా బట్టలు అట్టపోతరు. ఈళ్లు సిదిగి సంపాయిచ్చి నాకేమన్నా పెడ్తడా? అసలు ఈ ముసిలోనికి సిగ్గులేదు!" అని మా నాయన్ను తిట్టడం తిరుక్కుండ.

నేను మా యమ్మ తిట్లను పట్టిచ్చుకోకుండా దొడ్లోకి పాయి నాలుగు చెంబులు నీళ్లు బోసుకుంటి. అప్పటికే సీకటి పడ్డంతో దొడ్లో సబ్బు యాడుందో కనిపియ్యకపాయ. సబ్బేడుందని అడిగితే మా యమ్మ ఇంగా ఏయేమి తిట్లు తిడ్తదో యని సబ్బు లేకుండానే నీళ్లు బోసుకుని ఇంట్లోకొచ్చి గుడ్డలేసుకుంటి.

సీకటి బాగా ముదిర. మా ఈదిలో పన్లకు పోయొచ్చినోళ్లు, బరుగొడ్లు కాయను పోయొచ్చినోళ్లందరూ ఇండ్లకు జేరుకుని బువ్వలు తిండానికి తయారయితాండిరి. ఆడోళ్లు కుండకాడ కూచ్చొని మొగునికి పిల్లోల్లకు ముసిలోల్లకు బువ్వ పెడతాండిరి. ఒక్కొక్క ఇంట్లోనుండి ఒక్కోరకం కూరాకుల వాసన వచ్చాండ. మా నాయన ఈదిలో నులక మంచమేస్కుని కూచ్చోని, ఎదురింటి సాతానయ్యతో మాట్లాడ్తాండ.

నేను మా యన్న మిల్ట్రినుండి దెచ్చిన స్వెట్టర్, మఫ్లర్ తీసుకుని, ఒక సంచిలో బియ్యము, ఒక సీసాలో ఇంత నూనె, ఒక చిన్న కాయితంలో ఇంత కారంపొడి, ధనియాల పొడి, పసుప్పొడి అన్ని పెట్టుకోని సిన్నిగానికోసం ఎదురు సూస్తాన్న. ఇంతలో సురేస్ సైకిల్లో వచ్చె. ఆ మనిసి సైకిల్‌కు బ్యాట్రి తగిలిచ్చివుండె. పైన స్వెట్టర్, మఫ్లర్ ఏసుకోనుండె. సైకిల్‌కు స్టాండేసి వచ్చి నా తట్టు తిరిగి ఏదో అడగబొయి, ఆ పక్కనే వసారా బయట నులకమంచం మీద కూచ్చోని బీడీ తాగుతాన్న మా నాయన దగ్గడంతో నా సెవికాడ నోరుబెట్టి

"బీడీ కట్టలు పెట్టుకున్నవా?" అనె సురేసు.

"అంగడికి పొయి కొనక్కరావాల!" అంటి, మా నాయనకు ఇనిపియ్యకుండ.

"తొందరగ పోరా, నాయాల! టైమైతాంది!" అని నా చేతిలో బ్యాట్రిలైటు తీసుకుండె.

నే నంగడికి పొయి ఒక అరబురుజు తుల్సి బీడీలు, అరడజను అగ్గిపెట్టెలు, రెండు పాకెట్ల సిజర్ సిగరెట్లు కొనుక్కోని వస్తాంటే మాఇంటి బయట మా నాయన కూకున్న మంచంమీద మా నాయనకు శెరోపక్కన సురేస్, సిన్నిగాడు కూచ్చోని మాట్లాడ్తాండిరి. మా నాయన ఏదో చెతురు మాటన్నట్లుండాడు. ఇద్దరూ గట్టిగా నగిరి. వాళ్ల కొక్క రవ్వ దూరంలో మాఇంటి గోడకున్న అరుగుమీద ఇంగా ఇద్దరు కూకున్నట్లు అనిపిచ్చె. ఎవురబ్బా ఈళ్లు అనుకుంటాంటేనే ఈదిలైటు ఎలిగె. ఆ ఎలుగులో అరుగుమీద కూకున్న కాశింపీర, ఎంకొరెడ్డి నన్ను పలకరిచ్చినట్లు నగిరి. నేం గూడా నగితి. ఈ లైటెలుగులో మా నాయనకు నా సేతిలో వున్న బీడీలు, సిగరెట్లు కనిపియ్యకుండా పట్టుకుని సిన్నగా అరుగుకాడికి సేరుకుని సంచిల్లో ఎట్టపెట్టుకోవాలబ్బా అనుకుంటుంటే పుటుక్కున ఈదిలైటారాపాయె. అబ్బ... బతికితిరా, నాయనా! అనుకుంటా వాటిని నా సంచిలో గబుక్కున దూరిచ్చి.

"అన్ని పెట్టుకున్నవా?" అనె సిన్నిగాడు నావక్క జూసి.

"ఆఁ... పెట్టుకున్న. తుపాకేది?" అనింటి.

"అద్దో ... ఆ అరుగుమీద పెట్నగాని పా, పా! టయం బారయిపాయ!" అంటానే సిన్నిగాడు వాడి సంచి తుపాకి సేతుల్లోకి తీసుకుండె.

"వచ్చుం, మామ!" అనె సురేశ్ మా నాయన్తొ.

"శామంగ పొయి, లాబంగా రాండోయ్!" అనె మా నాయన.

"సురేసుగా! యా దావన బోదం?" అనె సిన్నిగాడు.

"ఏటెంబడి బోదాం, పారా!" అనె సురేసు.

అందరం సైకిళ్లకు సామాన్లు తగిలిచ్చుకోని కదలబోయేముందు ఎంకరెడ్డి సేతిలో వున్న బాట్రిలైటేశ. డొంక దావ తట్టు సీకటిని సీల్సుకుంటా పాయ ఆ లైటెలుగు.

"ఎవ్వరు లేరు, పాండి!" అనె ఎంకరెడ్డి.

అందరం సైకిళ్లు తోసుకుంటా కదిల్తిమి.

డొంకలోకి వచ్చిమో, లేదో, డొంకలో వాసన గాటుగా తగిలె. "అబ్బ! థూ! థూ! యా నా కొడుకో చెడేరిగినట్టుండాడు కంపు!" అనె సురేసు. అట్ట అంటూండగానే కోంటోళ్ల సత్తెం చెంబు సేతవట్టుకుని చెట్ల పక్కనుండి దావలోకి వచ్చి పంచె సర్దుకుంటా, చెంబులో మిగిలిన నీళ్లు పారబోసి, మమ్మల్ని సూసి "యాడికి? అందరూ ఈ యాలప్పుడు పోతాండరు?" అనె.

"మేము సరే, శెట్టీ! నీకు యాలా పాలా లేదా యూరగడానికి?" అనె సురేసు. దానికందరూ నగిరి.

"సికారికి పోతాండారా?" అనె సిన్నిగాని సేతిలో తుపాకి జూసి.

"ఆఁ, పోతాండం! మూసాల్మూరుకో!" అనె ఎంకరెడ్డి.

"ఎందుకు నూరుకోడు? యువ్వడ్రా ఈ కాలంలో సిమ్మలు తిన్నోడు? బాపనోళ్లు, కోంటోళ్లు అందరూ బయిరంగంగా తినబట్టే కాదూ కూరాకు రేట్లట్ట పెరిగింది!" అనె కాశింపీర.

అట్టా మాట్టాడుకుంటూండగానే ఏటికాడి కొచ్చిమి. పారంసెట్ల మీదుండే కీసురాళ్లు గీ అంటా అరుచ్చాండె. ఏట్లొ నీళ్లు దాపుకు పోతానే గట్టుమింద కూచ్చున్న కప్పలు ఏట్లోకి తపతపా అంటూ ఎగిరి దూకె. దూరంగా ఉన్న కొన్ని కప్పలు పోటీ పడరుచ్చాండ. ఏపుగా పెరిగిన తుంగ, జంబుల వద్ద శాపలు లొటలొటా అంటా కెలకలేస్తాండె. బాటరీలైటు ఎలుగుకు ఏట్లో తిరుగుతున్న పురుగులన్నీ వస్తాండె. సైకిళ్లు నీళ్లల్లోకి దింపితిమి. సన్న శాపలన్నీ ఎగురుకుంటా దూరంగా పాయె.

బాట్రిలైటు ఎలుగుకు కొన్ని శాపలు దిక్కు తెలియక అట్టనే లైటుతట్టు చూస్త నిలబడిపాయె. వాటిని జూసి, "వరేయ్! నా లైటుకు శాపలు గూడ నిలబడ్తాండయ్!" అనె సురేసు.

"ఆఁ, నీ లైటుకు శాపలు గారెంటిగ నిలబడ్తయి. ఆ ఎలుగు జూడు, గుడ్డిదానికి దడ్డు జూపిచ్చినట్టుంది!" అనె కాశింపీర.

"నాకు ఇదన్నా ఉంది, నీకు అది గూడ లేదు గదోయ్!" అనె సురేసు.

"ఆఁ, పనికిరాని మొగుడు వుంటేనేం, లేకుంటే నేం అనీ ... నాకెందుకు ఇట్టాటి లైటు? నేను గొంటే అయిదు బాట్రీలదే కొంట!" అనె కాశింపీర.

ఇట్ట చెతురు మాట్లాడుకుంటూండగానె ఏరు దాటి మెయిన్ రోడ్డెక్కితిమి.

రోడ్డుమింద నుండి మా ఊర్ని జూచ్చె, నిద్దరపోడానికి ముందు తూగుతున్న సిన్నపిల్లోని మాదిరిగుండె. అందరం రోడ్డుమింద గూచ్చొని సిగరెట్లు, బీడీలు ఎలిగిచ్చి సైకిళ్లెక్కితిమి. పారం కంపచెట్ల మద్దెన పామ్మాదిరి మెలికలు తిరిగి వుందా రోడ్డు. ఆ పారంకంపచెట్ల మీ దుండే కూసురాళ్లు మా ఊర్లో మండే మంగళోల్లు పీర్లపండగరోజు సన్నాయి వాయించినట్లు గీ అంటూ అరుస్తాండె. మా సైకిళ్ల డైనిమా సప్పుడు, గిర్రున తిరుగుతాన్న సైకిల్ టైర్ల సప్పుడు, ఆడాడ సైకిళుగాన్లు గుంతలో పన్నప్పుడు వచ్చే సప్పుడు కీసురాళ్లకు పక్కాయిద్యాల్లాగుండె.

"దేవి కష్టంబు లెట్లుండనో? పుణ్యచ్చేత్రమైన వారణాసి దర్సించి వచ్చెదమా?" అంటూ పద్దె మెత్తుకుండె సిన్నిగాడు.

"జవదాటి ఎరుగందీ లతాంగి!" అంటూ సురేస్ మరో పద్దెం ఎత్తుకుండె.

వాళ్లట్ట ఒకరయినంక వకరు పద్దాలు పాడతానే ఉండిరి.

మా ఊరికాన్నుండి ఒక గంటసేపు సైకిళ్లలో పోతే గాని సుగాల్దొడ్డి రాదు. నా దాస తుపాకి మీందికి పాయె. ఈసార్నయినా సిన్నిగాడు తుపాకి పేల్చనిచ్చాడా? లేదా! అనుకుంటి. అసలు నాకీ తుపాకి పిచ్చెట్ట పట్టిందంటే, చిన్నప్పుడు ఏడో తరగతి సదువుతాన్నప్పుడు ఇంగిలీసు నాన్‌డైల్‌లో అడవిలో తుపాకి పట్టుకుని సెట్టుసాటు నుండి జింకను గురి జూచ్చున్న ఇంగిలీసోడి బొమ్మ నాకు తుపాకి పిచ్చి పట్టేట్టు జేసింది. దాంతోనే నేను సికారికి పోయే సిన్నిగాన్తో నేస్తం జేసుకున్న. సిన్నిగానెంట యాటకు పోడం, వాడు తుపాకి ఈసారి పేలుజ్జావులే అండం, ఈసారి ఎట్టయినా తుపాకి పేల్చాలనుకోవడం ... ఇదే వర్సయింది సంవత్సరం కాన్నుండి.

ఇట్టాలోచిస్తాండగానే సుగాల్దొడ్డి దాపుకొచ్చిమి. ఆ తాండాలోని కుక్కలు మా సైకిళ్ల సప్పుడిని "భౌఁ!" మంటూ అరుపులు మొదలుబెట్టె. కొన్ని కుక్కలు ఉరుక్కుంటా మా మీదికొచ్చె. "పో నియ్యి.... ఈ కుక్కలు దొంగలు వచ్చినప్పుడు మొరగవు! డొంకలోకి పోయెచ్చేవాన్ని జూసి మొరుగుతయి!" అంటూ కుక్కల్ను తరుముకుండె ఎంకరెడ్డి. సుగాల్దొడ్లో కంచెల మద్య నెమరేసుకుంటూ గమ్మున పండుకున్న ఆవులు, మేకలు మా సప్పుడిని బెదురుకున్నట్లాయె. కుక్కల అరుపులు, సైకిళ్ల సప్పుడుకు ఆవులు, మేకలు బెదురుకోడంతో ఇండ్లల్లో పండుకున్నోళ్లు బయల్లో పండుకున్నోల్లు మా తట్టు జూసి, "యాటగాళ్లురో!" అనుకుంటాండిరి.


వాళ్లట్ట మమ్మల్ని యాటగాళ్లన్నందుకు నేను శానా సంబరపడ్తి. యాల్నంటే, యాటొడ్డము ... యాటగాడు అనిపించుకోడం నాకు శానా ఇట్టం.

సైకిళ్లు ఎంకటేసు ఇంటి వసార్లో పెడ్తిమి. ఎంకటేసు, సుబ్బమ్మ ఇంట్లోంచి బయటికొచ్చిరి. మమ్మల్ని జూసి, "ఏమి, లేటాయె?" అనె ఎంకటేసు.

"కలసపాడు మీ ఇంటెనుకుందా? అంత దూరం నుండి రాడమంటే పిల్లకుశాలనున్నవా?" అనె సిన్నిగాడు.

సంచిలో బియ్యము సుబ్బమ్మకిచ్చి బువ్వొండమని జెప్పి, సిన్నిగాడు నెత్తికి లైటుకట్టుకుని ఒక సంకకు బాట్రి తగిలిచ్చుకోని బుజంమీద తుపాకి పెట్టుకుని "తడుకు చెరువుకిందికి పోయొచ్చం!" అనె సిన్నిగాడు.

సురేస్, కాశింపీర, ఎంకటేసు బయల్దేరిపోయిరి. నేను, ఎంకరెడ్డి ఎంకటేసు వాళ్లింట్లో గూకోని బీడీలు ముట్టిచ్చిమి. సుబ్బమ్మ బువ్వడేక్సా పొయిమింద బెట్టి పొయి రగల్జేసె.



పొయికాడ మంట ఎలుగులో సుబ్బమ్మ సగం మొకం తెల్లగా, అందంగా కనిపిచ్చాండె. 'అడవిలో ఉన్న ఈమెంత సోగ్గా ఉంది?' అనుకుంటి. ఆమె బువ్వ డెక్సా కలబెడ్తా ఇంగొక పక్క వట్టి మిరపకాయలకు తొడాలు పలుచ్చాండె. ఎంకరెడ్డి సుబ్బమ్మతో మాటలు గలిపి చెతురాడబట్టె. సుబ్బమ్మ వట్టి మిరగాయలు పెంకులో బోసి ఏంచుతాంటే ఆ గాటుకు ఎంకరెడ్డి ఆపకుండ దగ్గబట్టె. "ఈమయిన దగ్గేటోనికి చెతురొకటి!" అనె సుబ్బమ్మ నా తట్టు తిరిగి నగుతూ. నేను నువ్వు సెప్పేది కరెట్టే! అన్నట్లు నగితి.

దూరంగా తుపాకి పేల్న సప్పుడాయె. అది ఇని మసాలా సామాన్లు దీసి సుబ్బమ్మ కిస్తిమి. మళ్లీ రెండు దపాల: ుపాకి మోత ఇనిపిచ్చె. సుబ్బమ్మ బువ్వ గంజొంచి ఏంచిన వట్టి మిరపకాయలు, కాల్చిన ఉల్లిగడ్డలు ... ఇంత సింతపండు, ఉప్పు ఏసి కారం నూరి ఒక మూకిట్లోకి తోడి, మసాలా దంచడం మొదలుపెట్టె. కాసేపటికి సిన్నిగాడు, కాశింపీర, ఎంకటేసు, సురేసు వచ్చిరి. కాశింపీర సేతిలో మూడు మెడ సొగం తెగిన కుందేళ్లుండె. సిన్నిగాడు తలకుండే లైటు, సంకలో వున్న బాట్రి లైటు ఓ మూల్న బెట్టె. కుందేలు తోళ్లు ఒల్చి మాంసం తునకలు తునకలు కొట్టి సుబ్బమ్మ కిచ్చి కాళ్లు చేతులు కడుక్కని వచ్చె. ఈలోగా సురేసు తాను తెచ్చిన మిలట్రి రమ్ము అందరికీ గ్లాసుల్లో పోసిచ్చె. అది తాగుతా అప్పుడే సుబ్బమ్మ ఏంచుకొని వచ్చిన కుందేళ్లు ఆ యాలు నంజుకుంటిమి. మందాగడం కాంగానే సుబ్బమ్మ అందరికీ తలా ఒక గిన్నెలో అన్నం బెట్టె. వక వర్స వట్టి మిరగాయల కారం, మరొక వర్స కుందేలు కూరాకు. అందరం తాగిన మైకం. అడివి అయినందుకేమో బోదింటిమి. అది, బోకమ్మ కనిపిచ్చె. మేం బువ్వలు తిని బయటకొచ్చి సూచ్చె ఆకాసంనిండ మబ్బులు కనిపిచ్చె. వానకు ముందువచ్చే సల్లగాలి తగిలె. "పొండి, పోదాం!" అని సైకిళ్లు ఆన్నే పెట్టి కాలినడకన బయల్దేరిమి నల్లమల అడవిలోకి.

సుగాల్తాండా నుంచి తడుకు సెరువు మిందవడి గుండుబాయి దావన పోతిమి. గుండు బాయి కాడికి పొయ్యినంక వాన సినుకులు మొదలాయె. గుండుబాయికాడ వుండే మాన్ల మొదలుకాడ కూచ్చుంటిమి. టపటపా పడ్తాన్న సినుకుల సప్పుడు. గుయ్‌మంటొస్తాన్న సలిగాలి ... నల్లగుండే మబ్బు ... ఇయన్నీ నాకొకపక్క బయంగా, ఇంగొకపక్క మాంచి సొసం సేచ్చాన్నట్లనిపిచ్చాండె. చెట్టుకింద కూచ్చొని బీడి తాగుతాంటె బీడీ పొగ గట్టిగా పీలుచ్చాంటే, బీడి ఒక్కో రవ్వ ఎక్కువగ ఎర్రగ కనిపిచ్చాండె ఆ బీడీ ఎలుగు. వాన తగ్గినా సన్నగా తుంపర మాత్రం పడతాన్నది. ఇంగ ఈ తుంపర తగ్గేట్టు లేదు, పోదాం పొండి అని బయల్దేరితిమి.

రెండు మైళ్లు నడ్సినంక చిక్కటి అడవిలోకి పోతిమి. మాములుంగయితే వాతావర్ణం ఇట్టుంటే యాట శానా బాగా జరుగుతది. సిన్నిగాడు తలకు కట్టుకున్న లైటు ఎడంపక్క, కుడిపక్క తిప్పుతాండాడు. ఏ సన్న పురుగు కన్ను మినుకుమన్నా మళ్లా మళ్లా లైటేచ్చాండాడు. అట్ట నడ్సుకుంట దెగ్గర దెగ్గర పది మైళ్లదంక పోతిమి. ఒక్క జీవం గూడ కనిపియకపాయె. సిన్నిగాడు ఓ సెట్టుకిందాగి మా తట్టు లైటేసి దగ్గరకి రాండి అన్నట్లు దాంతోనే పిల్సె. అందరం సిన్నిగాని కాడికి పోతిమి.

"ఇంగ మెట్టుతో కొట్టాల్సిందే!" అనె సిన్నిగాడు.

(యాటకు పొయ్యేముందు ఎవురైనా ఎదురై పలకరిచ్చి, జీవాలు కనపడకపోతే యాటకు వచ్చినోళ్ల బొమ్మలు, ఎదురైనోని బొమ్మ రాళ్లమింద గీసి చెప్పుతో కొడితే దోషం పోతుందని యాటకు పొయ్యేవాళ్ల నమ్మకం.)


కాశింపీర, ఎంకరెడ్డి ఆరు రాళ్లు ఏరుకొచ్చె. మా అయిదు మంది బొమ్మలు, కోంటోల్ల సత్తెం బొమ్మ (కేవలం మనిసి బొమ్మ ఆకారం) గీసె సిన్నిగాడు. అందరం ఎడంకాలి మెట్టు ఇప్పి మా బొమ్మలను, సత్తెంగాడి బొమ్మను సెడ్డసెడ్డ తిట్లు తిట్టి తలా మూడేట్లు కొట్టి, బీడీలు తాగి, వుచ్చబోసి మళ్లా బయల్దేరితిమి.

ఒక మైలు దూరం బోతానే సిన్నిగాడు లైటు ఆకాసానికేసి జీవాలు కనిపిచ్చినట్లు సైగజేసె. బాట్రీకుండే ఆరన్ ఏశె. లైటు మల్లా ఆకాసానికేసి తుపాకి పైకెత్తి లైటు సుక్కలో సూపు కలిపి తుపాకి కుండే గుర్రాన్ని ఎన్నికి లాగె. సిన్నిగాడు లైటు మెల్లంగ కిందికి దించుతాంటే నేను సిన్నిగాని దెగ్గరిగా పొయి నిలబడ్తి. సిన్నిగానిలైటు మెల్లంగ కిందికి దిగి నిలబడి నెమరేచ్చాన్న దుప్పులమీద పడ్తాండె 'ఇంగ కొట్టిలే! ఢామ్మని పేల్తది!' అని అనుకుంటాంటె సిన్నిగాని సేతిలో ఉన్న తుపాకి కిలుక్కుమనె. తూటా పేలకపాయె. సిన్నిగాడు ఎనిక్కి చెయ్యి జాపి ఇంగొగ తూటా ఇయ్యమన్నెట్టు సైగ జేసె. ఇంగొక తూటా దీసిచ్చె. ఆ తూటా పెట్టి మళ్లీ టిగ్గర్ నొక్కె. మళ్లా తూటా పేలకపాయె. ఇట్ట జరుగుతాంటే ఎంకరెడ్డి ఖళ్లుమని దగ్గె. ఆ దగ్గు ఇనపడి జీవాలు పెళపెళమంటా సప్పుడు సేసుకుంటా ఎల్లిపాయె. సిన్నిగాడు ఎంకరెడ్డిని చెడ్డ తిట్లు తిట్టె.

"నా కొడక! తూటాలు కట్టుకుందాంరా అంటే ఇనకుండా మిలట్రోడి తూటాలు అని తెచ్చె... అవి మొ... చూపిచ్చె!" అనె సురేసు.

"అది గాదురా! నేం గట్టినయ్ కూడా తెచ్చె. ఒక్క రవ్వ పెద్ద జీవం గదాని వుర్జనలైతే బాగుంటదనుకుంటే ఈటెక్క ఇయి పేలకపాయె!" అనె సిన్నిగాడు.

మల్లా ఆన్నుండి దారి పడ్తిమి. రెండు మైళ్లు బొయినంక రేగి మాను రేవు కాడికి సేరుకుంటిమి. అది పులులు దిరిగే సోటు కాడంతో ఆడికి పోతానే అందరం చుట్టూ చూచ్చాంటిమి. ఒకరవ్వ బయంగా గూడ ఉండె. తుంపర మాత్రం అట్టనే పడ్తాండె. ఇంగొక్కరవ్వ ముందుకు పోతానే నీళ్లు పారతాన్న సప్పుడినిపిచ్చె. ఆ సప్పుడెంబడి పైకి ఒక వర్లాంగు బొయినంక బండ్ల బాట కనిపిచ్చె. బండ్ల బాటెంబడి నీళ్లు పారతాన్న పక్కకు పోతాంటే తుంపరకు నానిన దుమ్ము నీళ్లుబోసి పిసికిన సొడ్డపిండి మాదిరి కాళ్లకు కర్సుకొచ్చాండె. సిన్నిగాడు పోతా పోతా గబుక్కున ఆగి, దగ్గరకి రాండన్నట్లు వాని తలకాయ కున్న లైటుతో పిల్సె. 'ఏంది?' అనుకుంటా వానికాడికి పోతిమి. వాడు మాట్లాడకుండా కుడితట్టు లైటేసె. మేము అట్ట జూసి అచ్చర్యపడ్తిమి. ఒక మనిసి మోకాళ్ల మద్దెన



తలకాయ బెట్టుకోని గొంతు కూచ్చోనుండె. ఒంటిమీద గోసి తప్ప ఇంగే గుడ్డా లేకపాయె.


"ఎవురో పిచ్చోడేమో?" అనె సిన్నిగాడు.

"ఎవురైతే మనకెందుకు? పాండ్రి!" అనె సురేసు.

"ఎవుర్రాడు, ఈ యాలప్పుడు ఈడుండాడు?" అంటా దగ్గరికి పాయిరి ఎంకొరెడ్డి, కాశింపీర. వాళ్లెంబడి మేం గూడా బోతిమి.

"ఎవరో చెప్పరా నీ య..." అనుకుంటా సిన్నిగాడు ఆ మడిసి తలకాయుకు, మోకాళ్లకు మద్దెన తుపాకి మడిమ దూర్చి ఇడగొట్టబాయె. ఆ మనిసి ఒక్క రవ్వ గూడా పలక్కుండా ఇంగొక రవ్వ బిగదీసుకుండె.

సిన్నిగాడు తుపాకి కాశింపీర సేతికిచ్చి మోకాళ్ల మద్దెనుండి ఆ మనిషి తలకాయ బయటికి బీకె. పెరిగిన గడ్డం, చింపిరి జుట్టు, ఎఱ్ఱటి కండ్లు వున్న ఆ మనిసి, మా ఎవురుతట్టు సూడకుండా సిన్నిగాన్ని ఉరిం జూసి, అట్టనే మోకాళ్ల మద్దెన తలకాయ బెట్టుకోని కూచ్చుండె. ఇదంతా సూచ్చాంటె అంత సలిలో కూడా నాకు చెమట్లు పోసె. నాబల్లు సల్లబడి పాదీసం తప్పుతాండె. ఇంగ కింద బడ్తనేమోనని పక్కనే పారతాన్న నీళ్లకాడికి పాయి, గబగబ నాలుగు దోసిళ్లు నీళ్లు దాగి మొకం కడుక్కుంటి. ఇంతలో సురేసు నా కాడికి వచ్చి నన్ను రెట్టబట్టి పైకి లేపి, "ఏందోయ్... బయపన్నవా, అదురు నాయాలా!" అంటా అదురు పోయేదానికి ఈవు తట్టిడిసె.




కాలవ దాటి ఒక సెట్టుకింద కూచ్చోని మంటేసుకుని కాసేపు కూచ్చోని మళ్లా ఇంగొక పక్కకు సాగితిమి. సెట్టుకింద కూచ్చున్నప్పుడు సురేసు, సిన్నిగాడు "పులులు దిరిగే రేవులో మనిసి పగలు రాడమే కట్టం. అట్టాడ్డి ఇంత రాత్తిర్లో ఈడుండాడంటే యోగన్న అయుండాల, లేకుంటే తల రాత బాగున్న ఎఱ్ఱోడన్న అయింటడు!" అని తేల్చిరి.

ఈసారి ఏదో ఒక జీవం ఎట్టయినా కనపడ్తది, సిన్నిగాడు ఎట్టయిన కొడ్తడు అనుకుంటి. ఎందుకంటే సిన్నిగాడు మాంచి తెలివైన యాటగాడు. ఈని యాట గురించి సెప్పాలంటే ...

ఒకసారి మాంచి ఎండాకాలం. అడవిలో యాడా సుక్క నీళ్లు గూడా లేకుండా రేగిమాను రేవుకాడ గుండంలో మాత్రం ఒక్కరొవ్వన్ని నీళ్లున్నాయంట. సిన్నిగాడు పగులే ఒక్కడు ఆడికి పొయి సెట్లల్లో మాటు పెట్టుకుని కూచ్చున్నడంట. మద్దాన్నెం పన్నెండు గంటలప్పుడు ఒక అడవి పంది, ఒక పులి రెండూ గుండంకాడికి వచ్చి ఒకదాన్నొకటి తినేసేటట్టు సూసుకుంటాన్నాయంట. సిన్నిగానికి దేన్ని ముందు కొట్టాల్నో, అసలు కొట్టాల్నా వద్దా అనే ఆలోచన్లో పడెనంట. పులి ని గొడ్తే పందొచ్చి నా మీదబడ్తది. పులిని కొట్టడం పెద్ద కేసు గూడ. ఏం జెయ్యాలబ్బా అని ఆలోచించి ఎట్టయితే అట్టయిందని మాంచి సీసం గుండు తూటా ఎక్కిచ్చి పంది జబ్బలకు బట్టి ధనామని కొడ్తానే ఆ దెబ్బకు పంది పులి నన్నేమో జేస్తాందని ఎగ్గిరి పులిని మోరతో కొట్టి దెబ్బకు సంపి, అది కూడా సచ్చిందంట! అంత తెలివి వున్న యాటగాడు సిన్నిగాడు. యాటగాడికి గురొక్కటే కాదు, తెలివి కూడా శానా అవుసరం అంటారు పెద్దోళ్లు.

కాలి బాట దాటుకుని ఓ రెండు పర్లాంగులు మాంచి అడవిలోకి పోతిమి. ఎవల్లకు వాళ్లు ఆలోచిచ్చుకుంటా పోతాంటిమి. సిన్నిగాడు జీవం కనిపిచ్చినట్లు సైగ జేసె. ఆకాసానికి లైటేసి అటూ ఇటూ తిప్పుతా తుపాకిలో తూటా ఎక్కిచ్చి ఓ పదడుగులు మెల్లగ అడుగులో అడుగేసుకుంటా, లైటు సుక్కలో సూపు గలపడానికన్నట్లు తలకాయ, తుపాకి ఒక్కసారి పైకి లేపె. ఈసారి ఎట్టయినా కొడ్తడు అనుకుంటా ఊపిరి బిగబట్టి రాయిమాదిరిగా నిలబడి దగ్గొచ్చినా, ఉగ్గపట్టి సూస్తాంటిమి.

ఇంతలో సిన్నిగాడు "బాఁ...!" అంటూ చావు అరుపరిచె. వానికాడున్న లైటారిపాయె. మాకేమీ అర్థం కాల. "సిన్నిగా! ఏమైందిరా?" అనరిసె సురేసు. సిన్నిగాడు ఒగరిచ్చా వురుకుతా వచ్చె.

"ఏమైందిరా?" అని ఒకరయినంక ఒకరమడిగితిమి.

నా కే మర్థం కాలె. ఎందుకంటె సిన్నిగాడు మహా ధైర్నస్తుడు. అట్టాటోడు అట్ట అరిసేటప్పటికి గాబర గాబరాయె. సిన్నిగాడు తావటిచ్చాండడు "ముందు ఈన్నించి పాండ్రి, మీకు దండం పెడత!" అనె.

అందరం సిన్నిగాన్ని తలా ఒక పక్క పట్టుకుని ఉరికినట్లు నడుచ్చా బోతిమి.

గుండు బాయి దగ్గరకు రాంగనే కాశింపీర లైటు కూడ ఏసుకోకుండా బాయిలో దిగి నీళ్లు ముంచుకోనొచ్చి సిన్నిగాడికి తాపె. అందరం బీడీలు ముట్టిచ్చిమి. సల్లగాలి రివ్వున వచ్చి తగుల్తాన్న కూడా గబగబా నడుసుకుంటా వచ్చినందుకు మాకందిరికి సెమటలు పట్టిండె. సిన్నిగాడు ఒక్క రవ్వ తేరుకుండె. అందరికాడ ఎవురికి సెప్పొకండని పెమాణం జెయించుకుండె.

"అదిగాదురా ..." అని ఆ మబ్బులో గూడా సుట్టూ జూసె, వాడు సెప్తాంటే ఎవర్నా ఇంటరేమోనని. వాడెంత బెదురుకున్నడో వాని మొకం సెప్తాండె.

సిన్నిగాడు సెప్పడం మొదలుపెట్టె. "రెండు మాంచి దుప్పులు కనిపిచ్చె. పోతుది నిలబడి నెమరాచ్చాన్నది. ఇంగొకటి పండుకోనుండె. నేను ముందు లైటు పైకెత్తిన కాన్నించే కొడ్దామనుకుని, తుపాకిలో ఉన్న తూటాలో పిచ్చులు తక్కువుండై. సరింగ ఏటు బడ్తదో, లేదోనని ఇంగొక్క రవ్వ ముందుకు పోయి లైటు, తుపాకి పైకెత్తితి ..." అంటూ ఆగిపాయె.

"ఏమైంది సెప్పురా.....!" అనె సురేసు.

సిన్నిగాడు గొంతు తగ్గిచ్చి "పైన చెట్టుకొమ్మకు ఎవురో ఆడమనిషిని ఉత్తబిత్తల యాలాడదీసింద్రు.... కనిగుడ్లు బయటకొచ్చిండె!" అనె సిన్నిగాడు బెదురేడు పేడ్చి. "ఇంగెప్పుడు సికారికి రాను!" అని ఒట్టు బెట్టుకుండె.

అది జరిగినంక మేమందరం ఎవురి బతుకుదెరువుకోసం వాళ్లు తలా ఒకపక్క ఇడిపోతిమి. నేను అయిదరాబాదుకొచ్చి ఏడేండ్లాయె. ఆమద్య ఒకసారి మా ఊరికి పోతే, బస్టాండు కాడ చింతచెట్లు కింద సిన్నిగాడు ఓ కట్టె చేతబుచ్చుకోని, దాంతో తుపాకితో జీవాల కాలుచ్చాన్నట్టు చేచ్చాండె.

"ఏమయింది ఆ మనిసికి?" అనడిగితి.

"నీకు తెల్దా...? సిన్నిగాడికి పిచ్చెక్కింది!" అని ఎవురో అనిరి.

నాకు వాన్ని సూడగానే ఆ దినం మేము జేసిన చివరి సికారి మతికొచ్చె. ■